# ఉభయకుశలోపరి

ఆ పల్లెటూళ్లో ప్రతి ఇల్లూ ఆ వేళకే మేల్కొంది. పనులు చేసుకునేవారు చేసుకుంటున్నారు. పొలం పనులకు బయల్దేరేవారు తయారవుతున్నారు. సేద్యానికి వెళ్లాల్సిన రైతులు, కూలీలు సిద్ధమవుతున్నారు. ఎడ్లకి మేత, గొడ్లకి దాణా వేసి కాడి కడ్తున్నారు కొందరు. ఆ ఊరి నుంచి పొరుగు పట్టణంలో పాలు, పెరుగు, వెన్న అమ్ముకునే వాళ్లు కేరియర్లు, కుండలు, పిడతలు సిద్ధం చేసుకుని పాత్రలు జాగ్రత్త చేసుకుంటున్నారు.

నీలకంఠ శాస్త్రిగారు నిత్యంలాగే అప్పటికే నిద్రలేచి, కాలకృత్యాలు తీర్చుకుని, మడి కట్టుకుని, సంధ్యావందనాదికాలు పూర్తి చేశారు. పెరట్లో ఈశాన్యాన ఉన్న బావి దగ్గరే ఆయన అఘమర్షణ సూక్తం చెప్పుకుంటూ స్నానం చేస్తారు. అక్కడే సంధ్యావందనం, సహస్ర గాయత్రి పూర్తి చేస్తారు. ఆపై తాను స్వయంగా తెచ్చుకున్న పుట్ట మట్టితో పార్థివ లింగాన్ని తయారు చేసుకుని పూజ గదిలోకి నడిచారు. అక్కడ నమక చమకాలతో అభిషేకం చేశారు. బెల్లం ముక్క నైవేద్యం పెట్టి ధూప దీప నీరాజనాలిచ్చి పూజ ముగించి తాను తీర్థం స్వీకరించి, భార్య విశాలాక్షమ్మకు మంత్రసహితంగా తీర్థం ఇచ్చారు. 'సాలగ్రామ శిలావారి పాపహారి నిషేవ్యతాం, ఆ జన్మకృత పాపానాం ప్రాయశ్చితం దినే దినే', ఆ సమయానికి పొద్దెక్కి పల్లెల్లో జీవనం మొదలైంది.

✧ ✧ ✧

సరిగ్గా అదే వేళకి అక్కడికి పది పదిహేను కి.మీ. ఉన్న పట్టణంలో బస్ స్టాండులో 'టాయ్‌లెట్స్' దగ్గర జనం క్యూలో నిల్చున్నారు. 'మూత్రశాల యాత్రాస్థలి' ఎక్కడైనా క్యూ కట్టక తప్పని రోజులు కదా ఇవి!

ఓ టాయ్‌లెట్‌లోంచి మనిషి బయటికి రాగానే సిమెంట్ తొట్టిలో ఉన్న నీళ్లని బకెట్‌తో తీసి 'రూం' క్లీన్ చేశాడు రాము. తొందర పడుతున్న మరో వ్యక్తికి మగ్‌తో నీళ్లందించాడు. అతను ఆదరాబాదరాగా లోపలికి దూరడం చూసి, 'అరెస్ట్ వారెంట్‌కన్నా తీవ్రమైందిది' అనుకున్నాడు తనలో.

క్యూలో నుంచున్న వ్యక్తుల్ని చూసి 'సార్! పందుంపుల్ల కావాలా? వేప్పుల్లయితే పావలా! ఉత్తరేణి పుల్లయితే యాభై పైసలు' అన్నాడు.

'పళ్లపొడి లేదా?'

'ఎందుకు లేద్సార్! ఎవరికేది కావాలంటే అది రెడీ! మామూలు పొడి అయితే పది పైసలు... స్పెషల్ అయితే ఇరవై పైసలు. మీ వద్ద బ్రష్షంటే కాల్గేట్ పేస్టుంది. యూమోఫోం కూడా ఉంద్సార్!'

'అదెంత?'

'కాల్గేట్, ప్రామిస్ అయితే పావలా! యూమోఫోం యాభై పైసలు"

'మొత్తానికి దీన్నో చిల్లర కొట్టు చేశావు!'

'ఊహూ! మినీ లాడ్జింగ్ లాన్ చేశాడు' అన్నారింకొకరు.

'ఉదర నిమిత్తం బహుకృత వేషం' అన్నారు మరొకరు.

నవ్వడు రాము. 'నా కోసమా అండీ! మీ కోసం, మీ సేవ కోసం. అంతే!' ముఖం కడుక్కోబోతున్న ఓ వ్యక్తిని చూసి అన్నాడు 'సబ్బుంది, సార్! ఫేస్ వాష్‌కి ఫెసిలిటీ ఉంది.'

'నలుగురూ రుద్దే సబ్బా.... ఊహూ' అన్నాడతను.

'భలేవారే! ఎక్కడికక్కడ హైజీన్ రూల్స్ సార్! సబ్బు చేతులలో రుద్దుకుని ముఖానికి రుద్దుకోవాలి. అంతే స్వంతంలా సబ్బుని ముఖానికి, చేతులకి రుద్దేస్తే - వామ్మో... అదీ ఇదీ కాదంటే సింగిల్ రూపీ సబ్బుంది, సార్!'

'స్నానానికి వీలుందా!'

'సారీ సర్! ఆ మాట అడక్కండి!'

'ఆ ఒక్కటీ అడగొద్దంటావ్?' నవ్వుతూ అన్నాడింకో అతను.

అంతా నవ్వేరు ప్రతిస్పందనగా.

✧ ✧ ✧

నీలకంఠశాస్త్రి పూజాదికాలు ముగించుకుని, భార్య ఇచ్చిన వేడి వేడి కాఫీ తాగి బయటకి వచ్చేసరికి సైకిల్ దిగి వస్తున్నాడు ఆయన మూడో కుమారుడు రామేశ్వరశాస్త్రి.

'నైట్ డ్యూటీ ఇంకా ఎన్నాళ్లు?'

'అయిపోయింది నాన్నగారూ! రేపు ఫస్టు డే షిఫ్ట్ వస్తుంది.'

'త్వరగా తయారవు. ముహూర్తం సమీపిస్తోంది...'

'ఎంత! పది నిమిషాల్లో తయారవుతాను... ఈ రోజు సోమవారం కదా! రాహుకాలం దాటాకే ముహూర్తం పెట్టే ఉంటారు మీరు.'

'ఇంగ్లీషుద్యోగాలు వెలగబెడ్తున్నా ఇంకా తిథి, వార, నక్షత్రాలు, రాహుకాలాలు, యమగండ కాలాలు, దుర్ముహూర్తాలు గుర్తున్నాయన్నమాట...'

'ఎమ్మే చదివాముని ఏబీసీడీలు, విద్వానయ్యానని అఆఇఈలు మరిచిపోతారా ఎవరయినా...'

'తర్కం.... ఊహూ.... వెళ్లు... వెళ్లు... అదిగో పాపన్న వస్తున్నాడు. ఎక్కడెక్కడ తిరిగొచ్చావో త్వరత్వరగా తల స్నానం చేసి, ముక్కు మూసుకుని శతగాయత్రి చేసిరా...'

రామేశ్వరశాస్త్రి వెళ్లాడు లోపలికి.

అతను దగ్గర్లోని పట్టణంలో ఓ ఫేక్టరీలో 'దిన బత్తెం' మీద ఉద్యోగం చేస్తున్నాడు.

కులవృత్తిని కాదని పొట్ట పోషించే ఉద్యోగాలంటే బొత్తిగా గిట్టని శాస్త్రిగారు కొడుక్కి ఏం పని, ఎక్కడ, ఎంత జీతం అని అడగలేదు. అతనూ చెప్పలేదు. ఆ చిన్న పల్లెటూళ్లో ఇద్దరు ముగ్గురు కులవృత్తితోనే జీవించడం కష్టమని తెలిసి కొడుకుల్ని వాళ్ల ఇష్టానికి వదిలాడాయన.

అతనటు వెళ్లగానే పాపన్న వచ్చాడు. అతని చేతిలో 'పట్టీ' ఉంది. భూమి పూజకి ఏమేం కావాలో శాస్త్రిగారు రాసిచ్చారు. కొత్తగా ఊళ్లో రైసు మిల్లు కట్టబోతూ భూమి పూజ చేయిస్తున్నాడతను. వాస్తు చూసి, ఆయం నిర్ణయించి, ఆయుర్దాయమూ నిర్ణయించి, ఆపై సుముహూర్తం పెట్టారాయన. 'ఆయం'లోనే రైసు మిల్లు ప్లానూ కుదిరింది. అధికారులు అనుమతించారు కూడా.

నమస్కారం చేసి పట్టీ అరుగు మీద పెట్టాడు పాపన్న. దాన్నందుకుని ఎగాదిగా చూసి 'అన్నీ తయారుగా ఉన్నయ్యండీ' అన్న అతని మాటలకి తలూపేడు.

'కూర్చో... రాహుకాలం దాటగానే బయల్దేర్దాం... అక్కడ మీ తమ్ముడున్నాడు కదా?'

పాపయ్య తలూపి కూర్చున్నాడు.

లోపల్నుంచి రామేశ్వరశాస్త్రి నిత్య పారాయణం చేసే సౌందర్యలహరి శ్లోకం వినిపిస్తోంది లీలగా....

దృశా ద్రాఘీయస్యా దరదళిత నీలోత్పలరుచా
దవీయాంసం దీనం స్నపయ కృపయా మామపి శివే
అనే నాయం ధన్యో భవతి నచతే హాని రియతా
వనే వా హర్మ్యే వా సమకర నిపాతో హిమకరః

✧ ✧ ✧

అనుకున్న ముహూర్తానికి భూమి పూజ ముగిసింది. ఆ తర్వాత శాస్త్రిగారికి 'భూరి' సంభావన ఇచ్చాడు పాపయ్య. దానితో పాటుగా నూతన వస్త్రాలు.

'మిల్లు పని చకచకా జరిగి అనుకున్న టయానికి మిల్లు నడిస్తే మీకూ, అమ్మగారికీ ప్రారంభోత్సవానికి పట్టు బట్టలు పెడతాను. దక్షిణా ఇచ్చుకుంటాను.'

'సంభావన కోసం చక్కని ముహూర్తం పెట్టానా ఏం? ఏకవిశంతి మహాదోషాలు లేకుండా చూసి నిర్దుష్టమైన ముహూర్తం పెట్టాను. మీనే, మిథునే శీఘ్రం అన్నారు. మీన లగ్నం పెట్టా. లగ్నానికి గురుదృష్టి ఉంది. చకచక పనులన్నీ అవుతాయ్. అనుకున్న వేళకి అన్నీ పూర్తవుతాయి' శాస్త్రంపై నమ్మకంతో తన జ్యోతిశ్శాస్త్ర పాండిత్యంపై విశ్వాసంతో అన్నారాయన.

'అలా జరిగితే అంతకంటే ఏం కావాలి స్వామీ!'

'నీకు అక్కర్లేకపోయినా నాక్కావాలోయ్...'

'ఏమిటీ స్వామీ?'

'ఇదుగో... వీడున్నాడే... ఈ బడుద్దాయ్... అందరం ఎందుకు వైదికాన్నే నమ్ముకోవాలని నియోగంలోకి దించుదాం అని వీడ్ని, వీడి తరువాతి వాడినీ ఇంగ్లీషు చదివించానా? ఈ వెధవ బియ్యే అత్తెసరు మార్కులతో, ఎం.ఏ థర్డు క్లాస్లుకి ఎక్కువా, సెకండ్ క్లాసుకి తక్కువగా పాసయ్యాడు. ఏం ఉద్యోగం వస్తుంది చెప్పు? 'సమూనానా ముత్తమ శ్లోకో అస్తు' అన్నట్టుంటేనే గానీ ఈ రోజుల్లో ఎవర్నా పలకరించరు కదా! వీడికి నీ మిల్లులో లెక్కలు రాసే ఉద్యోగం చూడాలి మరి...'

రామేశ్వర శాస్త్రి ముఖం మాడ్చుకున్నాడు.

'ఎసెస్సీ తప్పినోడికయితే ఫర్వాలేదు గానీ, ఎమ్మే సదివినోళ్లకి అట్టాంటి ఉజ్జోగం ఎలా గియ్యాల? అయినా గాని మీవోడు టౌన్లో ఉజ్జోగం చేస్తున్నాడు కదా!' అన్నాడు పాసయ్య తమ్ముడి బావమరిది.

అతని కొడుకు ఎస్సెస్సీ ఏడుసార్లు తప్పి ఇంటిపట్టునే ఉంటే ఇక చదువులతో నెగ్గుకరాలేడని, సంసారంలో నెగ్గుకరమ్మని పెండ్లి చేశాడతను. చదువు, ఉద్యోగం ఏమీ లేకపోయినా ఆస్తిని చూసి 'లక్షన్నర' కట్నం ఇచ్చారు. అది మిల్లులో పెట్టాడతను. కొడుక్కి తగిన ఉపాధి దొరుకుతుందన్న నమ్మకంతో.

'ఆఁ ఏం ఉద్యోగమో! ఏమో! బయట పదిరూపాయలు వచ్చినా ఉన్నూర్లో రూపాయ వచ్చినా ఒకటే! అద్దె పెడ్తే కానీ కొంపలు దొరకవు. తాగే నీళ్లు, పాలు, మజ్జిగ, పొయ్యి కిందికి, పైకి అన్నీ కొనాలి. కూరా నారా కూడా కొనక తప్పదు. అదే పల్లెటూళ్లో అయితే బియ్యం ఒక్కటుంటే చాలు. ఏరిన పుల్లలు, కోసిన చింతాకుతో బతుకు సాగించొచ్చు.'

శాస్త్రిగారి మాటలకు ఎవరేం అనలేదు.

రామేశ్వరం పూజా ద్రవ్యాలు అన్నీ తువ్వాళ్లలో మూట కట్టేశాడు. తండ్రి వెంట ఇంటికి కదిలాడు.

✧ ✧ ✧

చప్పున మెలకువైంది రామేశ్వరానికి. గోడకున్న పాత గడియారం అప్పుడే నాలుగు చూపిస్తోంది. ఒక్క క్షణం దిగ్భ్రాంతి. రాత్రా? పగలా? తల విదల్చుకున్నాడు.

'అప్పుడే నాలుగైపోయిందే. మైగాడ్!'

చప్పున నించున్నాడు. నాన్నగారు పెట్టే చివాట్లతో పాటే అమ్మ పెట్టిన కమ్మని అన్నం తిని పగటి నిద్రపోయిన అతనికి సమయానికి మెలకువ రాలేదు. గంట ఎక్కువ నిద్రపోయాడు.

శీతాకాలం పొద్దు. అయిదున్నరకే చీకట్లు ముసురుకుంటాయి. ఎంత వేగంగా తయారై సైకిల్‌పై పరుగు పరుగున వెళ్ళినా రోడ్డు చేరటానికి గంటకి తక్కువ పట్టదు. అక్కడ్నించి బస్సు పట్టుకుని వెళ్లి డ్యూటీలో చేరి - తన పార్ట్‌నర్‌ని రిలీవ్ చేయాలి. పగలంతా డ్యూటీ చేసిన 'అతను' అలిసిపోయుంటాడు.

తనని తనే మరోమారు తిట్టుకుని పెరట్లోకి నడిచాడు.

✧ ✧ ✧

ఎలాగైతేనేం సమయానికి డ్యూటీకి చేరుకున్నాడు రాము 'అతన్ని' రిలీవ్ చేశాడు.

'బ్రదర్! నే ఊరు వెళ్లొస్తా!' నీళ్ల డబ్బాలోని చిల్లర డబ్బుల్ని లెక్క పెట్టుకుంటూ అన్నాడు 'కృష్ణ!'

'ఊఁ ఎంతొచ్చిందేమిటి?'

'నూట పదకొండు.'

'ఈ వారంలో నీ కలెక్షన్ ఎంత?'

'దాదాపు తొమ్మిది వందలు....' అని క్షణం ఆగి అన్నాడు - 'ఆనాడు మనం ఈ పని చేద్దాం అంటే ఏమన్నావో నాకింకా గుర్తుంది. పుష్కరాల్లో స్నానాలు చేయించి 'నీరు కాసులు' పుచ్చుకోవడం లేదా అన్నావ్. తర్పణాల్లో తద్దినాల్లో 'పైసలు' ధార విడిపించి 'అవి' పుచ్చుకోవడం లేదా అన్నావ్. పది పైసలు, పావలాలు, అర్థలు, రూపాయలు ముడేస్తూ పోతేనే 'ముల్లె' అవుతుందన్నావ్. అందుకే అంగీకరించాగా.'

'నాన్నగారికి నీకు వీక్లీ పేమెంట్ అనీ, వారానికో రోజు 'ఆఫ్' ఉంటుందని చెప్పడం మేలయింది కదూ!'

దానికి కృష్ణ జవాబివ్వలేదు. క్షణం ఆగి అన్నాడు - 'అంతరాత్మకి అంగీకరమైతే ఎవరికీ సంజాయిషీ ఇచ్చుకో అక్కర్లేదు. చతుర్వేదాలూ, చతుర్వర్ణాలూ, కులవృత్తులు అన్నీ ఒకప్పటి మాటలు. అవి ఈ రోజుల్లో పని చేయవు. దేశం, కాలం గుమనించాలి.'

రాము అన్నీ విని నవ్వాడు.

✧ ✧ ✧

ఆ రోజు రాత్రి బాగా 'రష్'గా ఉంది బస్ స్టాండ్. అన్నీ బస్‌లూ 'ఫుల్'గా వెళ్లేయి. వచ్చేయి. ఆదివారం మహిమ కనిపించింది. చిల్లర డబ్బాలో చిల్లర భారీగా ఉంది. చిల్లర ఇచ్చి పుచ్చుకున్న నోట్ల బొత్తే నిక్కర్ జేబు నిండా ఉంది.

వేకువజామున వచ్చిన ఆ వ్యక్తి 'రాము'ని చూడగానే ఎక్కడో చూశానితన్ని అనుకున్నాడు. రామూకి తనని పదే పదే చూస్తున్న వ్యక్తిని చూడగానే ఎక్కడో పరిచయం ఉన్నట్టనిపించింది.

లోపలికి వెళ్లి అవసరం తీర్చుకుని తిరిగి బయటికి వచ్చిన ఆ వ్యక్తికి - పాపయ్య

తమ్ముడి బొమ్మర్తికి 'రాము' ఎవరో తెలిసిపోయింది. వారంరోజుల నాడు భూమిపూజ చేసిన స్వామి సంతానం!

✧ ✧ ✧

అతనొచ్చి పూస గుచ్చినట్టు చెప్పగానే నీలకంఠశాస్త్రికి చుక్కలు రాలినట్లు, రవి సోములు గతులు తప్పినట్లు భూమ్యాకాశాలు తలక్రిందులైనట్లు అనిపించింది.

'శివా! శివా! అనుకున్నాడు.

'మాదు శాస్తుల్లు, బాబూ! బతకడానికి ఏం పని చేసినా తప్పు గాదనేది నా సిద్ధాంతం. దొంగతనం, వెభిచారం, మోసం - యియి కాకుంటే ఏ తప్పూ ఉండదంటాను. అల్లని పూలంగడి తీసేసి కట్టెల అడితీ ఆడనే ఎవల్లూ పెట్టుకోరు కదా! అయినా ఇదేం గాచారం బాబూ! బంగారం లాటి బ్యాన్మల్లు పుట్టి అధమాధమం పని సెయ్యడానికి ఆ బాబు సేతులెట్టొస్తున్నాయ్ బాబూ! అయినా మీరు డబ్బులిత్తారంటే 'ఏమయినా సేత్తార్లే... అందుకే మీకు బర్కాత్ లేదు.'

చివరిమాట కాస్త కఠినంగా వినిపించింది. అనిపించింది. అయినా గరళం గళంలో దాచుకున్న శివుడి మల్లే నీలకంఠ శాస్త్రి నెమ్మదిగా ఉండిపోయాడు.

✧ ✧ ✧

రెండు రోజులుగా నీలకంఠశాస్త్రి అభోజనం ఉన్నాడు. అతనామాటలు చెప్పిన క్షణం నుంచీ 'అచమించటం' తప్ప - తీర్థం తప్ప - మరేం పుచ్చుకోలేదు. రామేశ్వరశాస్త్రి నిన్న రాలేదు. కృష్ణ బదులు 'డే' డ్యూటీ చేసి మళ్లీ నైట్ డ్యూటీ చేసి ఊరికి బయలుదేరాడు.

✧ ✧ ✧

కొడుకు రాక అల్లంత దూరంలోనే వినిపించింది. చేస్తోన్న అభిషేకం... 'మృత్యుంజయాయ రుద్రాయ నీలకంఠాయ శంభవే...' దగ్గరే ఆగిపోయింది.

భార్య కొడుకుని పలకరిస్తోన్న పిలుపు విని - చేతిలోని పార్థివ లింగాన్ని అలాగే పళ్లెరంలో విడిచి - రుద్రుడ్ని వెలివేసిన దక్షయజ్ఞానికి వచ్చిన దేవతలపై దూకిన వీరభద్రుడిలా వచ్చాడు.

'ఆగు కులభ్రష్టుడా!' అన్నాడు.

నివ్వెరపోయాడు రామేశ్వరశాస్త్రి - రాము....

'సచేల స్నానం చేసి - పీఠాధిపతులతో శుద్ధి చేయించి, దర్భతో నాలుక కాల్పించి, బ్రాహ్మణ పరిషత్తు విధించే శిక్ష చెల్లించి - ఆ తర్వాత కానీ ఈ గడప దాటే అర్హత నీకు లేదు.'

దిగ్భ్రాంతుడయ్యాడు రాము.

'ఎన్ని అబద్ధాలు... ఎంత గుండెలు తీసినతనం. ఇక్కడ సంధ్యావందనం, గాయత్రీ ఉపాసనా, స్తోత్రాలు, జపం...తపం,.... నియమం.... నిష్ఠ.... మడి, శుచి,... నీ పిండాకూడు... అక్కడ? దొడ్లూడ్వడం... నీరు కాసులు అందుకోవడం... మడికీ, మైలకీ, పరువుకీ, ప్రతిష్టకీ

పట్టుగొమ్మరా ఈ వంశం.'

కిక్కురుమన్లేదు రామేశ్వరశాస్త్రి.

విశాలాక్షమ్మ కిదంతా అగమ్యగోచరంగా ఉంది. భర్త రెండు రోజులుగా ఎందుకు అభోజనం ఉంటున్నాడో అంతుపట్టక అల్లల్లాడుతున్న ఆమెకి - భర్త శివతాండవం ఎందుకో తెలీలేదు.

'అంతగా బతకలేకపోతే భవతీ భిక్షాం దేహీ అని అన్నపూర్ణాష్టకం చదువుతూ జోలె పట్టుకుని ఇల్లిల్లూ తిరిగితే జోలి నిండా బియ్యం, జేబు నిండా చిల్లరా దొరుకుతాయి కదరా... వెధవా! అయినా నువ్వు సంపాదించి తెచ్చి పోస్తే కానీ నాలుగు వేళ్లూ నోట్లోకి పోవని లేదు కదరా భ్రష్టుడా! ఎందుకిలా చేశావురా కులభ్రష్టుడా?'

'నాన్నగారూ!'

'నాన్నంటూ ఈ నీలకంఠశాస్త్రి ఇంకా బ్రతికే ఉన్నాడనే జ్ఞానం, స్పృహ నీకు ఉన్నాయట్రా దుర్మార్గుడా!'

'ఏం జరిగిందండీ!' నోరు విప్పని కొడుకునీ, నోరెత్తనివ్వని భర్తనీ చూసి ఆగలేక అడిగిందామె.

'ఏమి జరిగిందా సామిదమ్మా! ఇది నువ్వూ, నీ కొడుకూ కలిసి ఆడుతున్న నాటకమా ఏం?'

'అయ్యయ్యో... మీరేం అంటున్నారు... నాటకమేమిటి?'

'నాటకం కాకపోతే సినిమా... మన బతుకు సినిమా... టౌన్లో నీ కొడుకేం చేస్తున్నాడో తెలుసా? వాడు వారం వారం తెచ్చిస్తున్నాడు. వీడు రోజూ దిన వెచ్చం తెస్తున్నారు అని మురిసిపోతున్నామే కానీ, అదెక్కడ్నించి వస్తోంది అని ఆలోచించామా? శవాలు మోసి తెస్తున్నారో... పిండాలు తిని తెస్తున్నారో, అడిగావా?'

'అయ్యో' అయోమయంగా అందామె.

'ఏడుపుకూడు తింటామటే మనం... మన బంగారక్కని బజారు పాలు చేసి ఆ సొమ్ము తింటామటే?'

'రామ! రామ!' చెవులు మూసుకుందామె.

'వీడు .... వీడు.... యీ పాపిష్టి వెధవ... పాకీ పని చేస్తున్నాడటే - బస్ స్టాండ్లో పాకీ దొడ్లల్లో వచ్చీ పొయ్యే వారికి నీళ్లందించి, శుభ్రం చేసి పావలా, అర్ధా సంపాదిస్తున్నాడే... అదే... ఆ సొమ్మే వీళ్ళు మనకి తెచ్చిచ్చేది...'

నిర్ఘాంతపోయిందామె.

'చెప్పరా మీ అమ్మకు చెప్పు... వేదాధ్యయనం చేసిన నోటితో - నే చెప్పిందంతా నిజం కాదని చెప్పు... ఏం... చెప్పలేవా?'

'నాన్నగారూ...!' నోరు పెగుల్చుకున్నాడు రాము! 'ధనం ప్రధానం అయినప్పుడు ఏ తప్పు అయినా ఒప్పే అవుతుంది. వాహనాలకు ఇంధనం ఎలాగో మనిషికి ధనం అలాగైంది మరి. పెట్రోల్ లేందే బండి నడవదు. ఇరుసున కందెన వేయకపోతే పరమేశుని బండి అయినా పోదట. గడనుడుగు మగని చూస్తే నడ పీనుగు అని ఆడవారు నవ్వుతారట. ఇవి ఇప్పటి మాటలు కావు. నా మాటలు కావు. పెద్దల సూక్తులు. మూటలకి కాక మాటలకి విలువనిచ్చే రోజుల్నాటి మాటలు...'

'అయితే..' అడ్డుకున్నారాయన. 'డబ్బు కోసం నానా గడ్డీ కరుస్తావట్రా భ్రష్టుడా?" అంతటితో ఆగలేదు. 'ఉచ్చం నీచం అక్కర్లేదా? నలుగురూ ఏమనుకుంటారని, ఏమంటారని లేదా? బుద్ధి నశించిపోయిందా?'

'నలుగురు... హు... ఏ న...లు...గు...రు నాన్నగారూ? రాజు, రాజ గురువు, మంత్రి, సేనాని... ఈ నలుగురూ ఆ రోజుల్లో ఏమంటారో ఏ శిక్ష విధిస్తారో అని భయపడేవారు జనం. ఎందుకంటే బలం, బలగం వాళ్ల చేతుల్లో, చేతల్లో ఉండేవి... ఈ కాలంలో మనిషి పోయాక మోయవలసిన నలుగురూ నాలుగు విధాలా అనుకని వెలేసి తగిలెయ్యరేమో అనే భయం ఉండేది. ఇప్పుడు ఆ నలుగురూ, ఈ నలుగురూ, ఏ నలుగురూ లేరు నాన్నగారూ!'

'హద్దూ, అదుపు తప్పి తిరగొచ్చనా నీ ఉద్దేశ్యం?'

'కాదు. ఎవరి బ్రతుకు వారిదయిన ఈ రోజుల్లో నానాటికీ కష్టతరమౌతున్న జీవనంతో ఎవరూ ఎవరినీ పట్టించుకోవడం లేదు. మీరే కాలగతి ఆలోచించండి! ఒకప్పుడు సముద్రయానం చేస్తే కుల భ్రష్టుడని బహిష్కరించేవారు. ఈ ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలో రైలెక్కి వస్తే గడప దాట నవసరంలేని ఆ రోజులకూ, కడుపు చేత్తో పట్టుకుని బ్రతుకుతెరువు అన్వేషించే ఈ రోజులకూ పోలి కెక్కడిది నాన్నగారూ! అవసరం వస్తే రాజ్యాంగాన్నే మార్చుకుంటున్న ఈ రోజుల్లో మనువునాటి, మాంధాతల్నాటి సిద్ధాంతాలు రాద్ధాంతం కాదా నాన్నగారూ?

'చెడిన దానికి మొక్కితే తనలాగే బతకమని దీవించిందట వెధవా? నీ ముఖం చూస్తేనే రౌరవాది నరకాలు...........'

'ఆగండాగండి నాన్నగారూ! కానివృత్తి చేపట్టాననే కదా మీరు నిందిస్తున్నది. నిలదీస్తున్నది! ఒకప్పుడు సేద్యం ఎవరి హక్కు? ఇప్పుడెవరు చేస్తున్నారు. వర్తకం ఎవరిది? ఈనాడు ఫలానా వర్ణం వారే వ్యాపారం చేయాలంటే అవుతుందా? రాజ్యాధికారం ఎవరిది? అ క్షత్రియులేనా ఇప్పుడు మనల్ని ఏలుతున్నది? అంతా మారిపోతూ ఉంటే మనం మారం అంటే ఎలా నాన్నగారూ!'

'బాబూ! నేను పల్లెటూరి వాడ్ని ఊరు దాటి వెళ్లని వాడ్ని నీ కున్న లోకజ్ఞత నాకు లేదు. నీ కున్న వివేచన లేదు.' కళ్లల్లో నీళ్లు తిరగ్గా అన్నారాయన

'నాన్నగారూ!' విస్తుపోయాడు రాము.

'ఔను సంప్రదాయంలో పుట్టా. పెరిగా, బతుకుతున్నా ఆ పరిధి దాటని వాడ్ని.....కానీ........'

'నాన్నగారూ! నేను సంస్కృతిలో, సంప్రదాయంలో 'సర్వీస్' అనేది కొత్తగా పుట్టుకొచ్చిన మాట. సర్వీసుకి వెళ్లి చేయడం తప్పు కాదు. పైగా ఒప్పుకూడాను. అది అడుగుతున్నారని....పని చేసేవాడికి డబ్బు సర్వీస్ అంటున్నా వాడికి తృప్తి ప్రధానం....అదేమైనా సరే నాన్నగారూ! ఎందుకో ఇష్టం, సేవ లేదు. అంతరాత్మ అంగీకరిస్తే సమాజ ద్రోహం కాకపోతే అది ఉత్తమమైంది! ఉన్నతమైందే నాన్నగారూ!'

ఆయనేం అన్లేదు.

'ఇంట్లో పెద్దవాడు ఎంత ముఖ్యమో.....చిన్నవాడూ అంతే.'

'అందరికీ కొట్టుకుని పిల్లల్ని పోషించాల్సింది ఎవరివల్ల?'

'అక్కర్లేదు.... ఇంటర్వ్యూలకి వెళ్తున్నాను. కాయకష్టంచేసి బతుకు సాగించుకుంటాను. అయినా నాకింకో విషయం చెప్పాలనిపించి నాకు తెలుసు అందుకే ఇన్నాళ్లు మీ దగ్గర దాచాం....

ఇంకేం అన్లేదు..... వెళ్లొస్తా అన్నాడు- నాన్నన్ని చూడండి.'

✧ ✧ ✧

శాస్త్రిగారు ఆ క్షణాన నిలువెల్లా కృంగిపోయారు. మనస్సుకు శాంతి లేక, జీవన్ముక్తి మరణానికి అయిన ఎటూ వెళ్లిపోయారు. ఎప్పటిలా ఇంటికి తిరిగిపోయారు.

'వెంకట శాస్త్రి! ఇన్నాళ్ళు నువ్వు కర్మలు చేశావు. నేను పరమాత్మను, సర్వాంతర్యామిని నాలో ఆత్మకి పరమాత్మ సంబంధమే ముఖ్యం......ఆత్మకి కులం లేదు. మతం లేదు. జాతి లేదు, లింగం లేదు. కులాలు - వర్ణాలనే భేదం లేదు. సృష్టిలో అంతా సమానమే కదా! అక్కడి కొచ్చాక అందరి గతి ఒక్కటే. అందుకే నే నక్కడే ఉంటున్నాను. పుట్టుక మాత్రం అంతే కదా! అంత భక్తి శ్రద్ధలతో పూజలు చేసినా ప్రశ్నకు పుట్టిన వాడే కదా! మధ్య వచ్చిన మాయతెరలు మనకెందుకయ్యా ఇంత ప్రాధాన్యం? నేను అంటుంటాను! 'మనిషికి మానవత్వమే వుండాలి అదే ముఖ్యమన్నను!' అని ఎన్నిసార్లు లోకం తెలుసుకోవాలి అక్కడా! సర్వ జీవ సమానత్వం కోసం ప్రతి నిమిషం అని చెప్పినా! కోటి నమూనా మనుషుల్లోనూ కలియుగా! కొత్తది ప్రజ అంతే! మనలో కలుస్తారు కదా! జీవ బ్రహ్మైక్య సమయంలో ఏమున్నా ఈ మధ్య వచ్చిన తెరలు ఏలా? పర తత్వం ఏమిటి? సర్వ సమానత్వం కదా!

"మీ నాన్న గారి సర్వీసు మానుకున్నాడు అనుకుంటున్నావు! బ్రతుకు! బ్రతికించు! ఎదిగించు! ఎదిగించు! ఇదే కదా జీవన సిద్ధాంతం! నీవు, నేను ఇద్దరం కూడా ఉండాలి అనేదే కదయ్యా అద్వైత సిద్ధాంతం? నువ్వు నేను....నువ్వే నేను....అంతే కదా!

వెన్నెల వెలుగులో శాస్త్రి గారి కళ్ళల్లో నీళ్ళు తిరిగి వెలిగిపోయాడు. అతని కళ్లలో నీళ్లు చెమ్మగిల్లుతున్నాయి.

● ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 15-9-93 ●